క్లుప్తంగా

సచివాలయ సిబ్బందికి సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న రెండు సచివాలయాల్లో ఇటీవల బదిలీపై వెళ్లిన 13 మంది ఉద్యోగులను సర్పంచు తలారి అరుణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. రాయలచెరువు రెండు సచివాలయాలకు చెందిన సిబ్బందిని సర్పంచు అరుణ, నాగేష్ దంపతులు, వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్, రషీద్, జగదీష్, జిలాన్, హనుమంత రెడ్డి తదితరులు శాలువాలు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



నీటి తొట్టెను పరిశీలిస్తున్న వైద్య బృందం

యాడికి: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 3వ సచివాలయంలో మంగళవారం డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు పరమేశ్వర, సుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం సమీప కాలనీలో మురికి నీటిని , చెత్తా చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో డెంగీ దోమల నివారణకు డ్రైడే ఫ్రైడే పాటించడం, దోమతెరలు వాడటం తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వారానికి ఒకసారి ఇళ్లలోని తొట్టెలు, కుండలు, బానలు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే భవిష్యత్ బుగ్గి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్

పెద్దపప్పూరు: మాదకద్రవ్యాలకు బానిసైతే భవిష్యత్తు బుగ్గి పాలవుతుందని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం పెద్దపప్పూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల కలిగే కష్ట, నష్టాలను వారు వివరించారు. చదువులో పోటీతత్వం ఉంటే ఉన్నత స్థాయి విద్యావంతులుగా సమాజంలో గుర్తింపు తెచ్చుకుంటారన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారన్నారు. బాగా చదువుకుని తల్లిదండ్రులతో పాటు కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

జూదరుల అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హనుమేష్‌నగర్‌లో ఉన్న బయలు ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం పేకాట స్థావరంపై దాడులు చేసి జూదరులను అరెస్ట్ చేశామన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

యాడికి: మండలంలోని బోయరెడ్డిపల్లిలో మట్కా రాస్తున్న కుక్కల నరసింహుడును మంగళవారం అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. అతడి నుంచి రూ6,100ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని చేనేత కాలనీ సమీపంలో మంగళవారం మట్కా రాస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ. 11,150 నగదు, చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్ బాబు

గుత్తి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని డీఈఓ ప్రసాద్ బాబు అన్నారు. గుత్తిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా ఆయన పాఠశాలను సందర్శించి, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల పెంపు, భవనాల మరమ్మతులపై దృష్టి సారించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ట్యాంక్ ఆవరణలో మూలనపడేసిన ఓపెన్ జిమ్ పరికరాలు

● వృథాగా జిమ్ పరికరాలు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మున్సిపాలిటీ నిర్వహణలో ఉన్న పార్కులు, ఓపెన్ జిమ్‌లల్లో ఏర్పాటు చేసేందుకు ప్రజాసొమ్మును వెచ్చించి కొనుగోలు చేసిన జిమ్ పరికరాలు సేవచేయకనే తుప్పుపడుతున్నాయి. ఓపెన్ జిమ్‌లల్లో ప్రజలు వ్యాయామం చేసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేయాల్సిన జిమ్ పరికరాలు ఎస్‌జేపీ హైస్కూల్ వద్ద ఉన్న మున్సిపల్ ఓవర్‌హెడ్ ట్యాంక్ ఆవరణలో మూలనపడేశారు. ప్రజల ఫిట్‌నెస్, శారీరక దృఢత్వం, మెరుగైన ఆరోగ్యానికి దోహదపడే జిమ్ పరికరాలను నిరుపయోగంగా ఉంచడం కన్నా ప్రజల కోసం ఏదో ఓ పార్కులో వాటిని ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



మార్కెట్ యార్డులో వృథాగా రైతు బజార్ కేంద్రం

● 'లక్ష'ణంగా వదిలేశారు

గుంతకల్లు: స్థానిక మార్కెట్ యార్డులో లక్షలు ఖర్చు చేసి నిర్మించిన వైఎస్సార్ రైతు బజార్ మార్కెట్‌ను వృథాగా వదిలేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపు రూ.50 లక్షలు ఖర్చు చేసి రైతుల సౌకర్యార్థం రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. అందులో అధికారులు తలుపులు ఉన్న దుకాణాలకు అద్దె ఇచ్చి, మిగతా వాటిని ఉచితంగా వాడుకుని రైతులు పండించిన కూరగాయలు, ఇతర పంటలను విక్రయించే వెసులుబాటు కల్పించారు. అయినా ఎవరూ ఉపయోగించడం లేదు. ఈ విషయమై డీఈ రఘునాథ్‌ను వివరణ కోరగా రైతు బజార్‌లో దుకాణాలను బాడుగకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. మార్కెట్ యార్డు కమిటీ వాళ్లే ఏదో ఒకదానికి వాడుకోవడానికి చర్యలు తీసుంటామన్నారు.



కొత్తపెండేకల్లు రోడ్డుమార్గంలో ఒరిగిన విద్యుత్ స్తంభం

● పొంచి ఉన్న ప్రమాదం

పెద్దపప్పూరు: అసలే వానాకాలం ఆపై రోడ్డు మార్గంలో ఒరిగి ఉన్న విద్యుత్తు స్తంభం ఎప్పుడు కూలిపోతుందోనని వాహనదారులు బిక్కు బిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి పెద్దపప్పూరు మండలంలోని పెండేకల్లు వద్ద నెలకొంది. కుమ్మెత గ్రామం నుంచి నరసాపురం వెళ్లే రోడ్డుమార్గంలో పెండేకల్లు వద్ద రోడ్డు పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభం ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు వైపు ఒరిగింది. దీంతో వాహనదారులు, పాదచారులు ఎప్పుడు కింద పడుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఒరిగిన స్తంభాన్ని సరిజేసి ప్రమాదం జరగకుండా చూడాలని పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సత్యసాయి రథయాత్రకు స్వాగతం

గుత్తి/పామిడి: విశ్వశాంతి కోసం భగవాన్ సత్యసాయి బాబా శత వసంతాల వేడుకల్లో భాగంగా దేశ వ్యాప్తంగా చేపట్టిన సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర మంగళవారం గుత్తికి చేరింది. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఆలయాల నిర్వాహకులు, శ్రీ సాయి జూనియర్ కాలేజీ, శ్రీ సాయి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. తాడిపత్రి రోడ్డు వద్ద నుంచి రాయల్ సర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకూ.. అటు నుంచి శివాలయం మీదుగా షిరిడీ సాయిబాబా ఆలయం వరకూ రథయాత్రతో పాటు బైక్ ర్యాలీ నిర్వహించారు. చిన్న పిల్లలు కోలాటం చేశారు. మహిళలు భారీ ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. రథయాత్రకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రథం ఇన్‌చార్జ్ రామచంద్రమూర్తి, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఎంవీ రమణ, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రథ యాత్ర పామిడికి చేరుకోగా సత్యసాయి సేవా సమితి సభ్యులు బైకు ర్యాలీతో నగరోత్సవం గావించారు. సమితి అధ్యక్షుడు కే విశ్వనాథ్, రాజేశ్వరి దంపతుల ఇంటి ఆవరణలో కలశ పూజార్చన, భజనలు చేశారు.



గుత్తిలో రథయాత్ర దృశ్యం



పామిడిలో ర్యాలీ చేస్తున్న సత్యసాయి భక్తులు

హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపరచండి

గుంతకల్లుటౌన్/ గుంతకల్లు రూరల్: హాస్టళ్లలోని విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు, ట్రంకు పెట్టెలను ఇవ్వడంతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం దోనిముక్కల రోడ్డులోని కేజీబీవీ హాస్టల్‌ను వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం పరిశీలించారు. వంశీయాదవ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, కేజీబీవీలతో పాటు గురుకులాల్లో సౌకర్యాలను మెరుగుపరచడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు మణికంఠ, ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు శ్రీనివాసులు, పవన్, శివ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్ ఎస్‌యూ నాయకులు

గెలుపోటములు సర్వ సాధారణం

గుత్తి: క్రీడల్లో గెలుపు, ఓటములు సర్వ సాధారణమని, గెలుపు ఓటములను సమానంగా భావించే వారే అసలైన విజేతలని ఏడీసీఏ(అనంతపురం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్) సెక్రటరీ భీమలింగారెడ్డి, రైల్వే ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ రసూల్ అన్నారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడామైదానంలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. గెలిచిన వారు అత్యుత్సాహాన్ని ప్రదర్శించకుండా, ఓడిన వారు కుంగి పోకుండా ఉండాలన్నారు. అనంతరం ఆర్డీటీ కోచ్ మహేష్ (మగ్గి) మాట్లాడుతూ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ ఆగస్టు 12 వరకూ కొనసాగుతుందన్నారు. మొత్తం 15 జట్లు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాది నవీన్, సోల్మోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

సేవాఘడ్‌లో ప్రత్యేక పూజలు

గుత్తి/పెద్దపప్పూరు: గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో జగదాంబ మాతకు శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం భక్తులుపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవాలాల్ ట్రస్ట్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు జగన్నాథనాయక్, కేశవ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దపప్పూరు మండల కేంద్రంలోని కొండపై వెలసిన అంజిన్నస్వామికి నాగపంచమి సందర్భంగా భక్తులు పిండి వంటల నైవేద్యం సమర్పించారు.

ప్రమాదాల నివారణపై దృష్టి

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి, మిడుతూరు, క్రిష్టిపాడు, గుత్తి అనంతపురం తదితర గ్రామాల సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మండలంలోని కాశేపల్లి సమీపంలో జాతీయ రహదారిపై డివైడర్‌ను కొందరు వాహనదారులు పగులగొట్టి అడ్డుదారులు ఏర్పాటు చేసుకొన్నారు. అలాంటి ప్రమాదకర ప్రదేశాలలో జేసీబీతో గుంతలు తవ్వించారు. అలాగే వాహనదారులను అప్రమత్తం చేయడం కోసం రంబుల్ స్ట్రిప్స్, రేడియం స్టిక్కర్ సూచికలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

పుట్లూరు: రైతులు తాము సాగు చేసిన పంటలను తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని తాడిపత్రి ఏడీఏ రవి సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని అరకటివేముల గ్రామంలో చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటను పరిశీలించారు. మొక్కజొన్న ప్రతి 11 వరుసలకు ఒక సాలు కంది సాగు చేసుకోవడం వల్ల రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ కాత్యాయని, ఆత్మా బీటీఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఏటీఎం హిమబిందు, గౌతం, హెచ్‌ఈఓ రామాంజి, రైతు సేవా కేంద్రం సిబ్బంది రష్మిత, సుమతి, సుధ, రైతులు పాల్గొన్నారు.

గేట్ లైసెన్స్ రెన్యువల్ చేయించుకోవాలి

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులను తీసుకెళ్లే ఆటోలకు గేట్ లైసెన్స్‌లను డ్రైవర్లు రెన్యూవల్ చేయించుకోవాలని రైల్వే కమర్షియల్ అఫీసర్ కేహెచ్ కుమార్ సూచించారు. రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఆర్‌ఫీఎఫ్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. మొత్తం 50 ఆటోలకు గాను 24 ఆటోలు మాత్రమే లైసెన్స్‌లను రెన్యూవల్ చేయడంతో మిగిలిన వాటిని అక్కడి నుంచి పంపించారు. లైసెన్స్‌లను రెన్యూవల్ చేయకుండా ప్రయాణికులను ఎక్కించుకుంటే జరిమానాలను విధించడంతో పాటు ఆటో నెంబర్లను ఆర్టీఓ అధికారులకు అందజేస్తామన్నారు. వారం లోపు లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించుకుంటామని డ్రైవర్లు ఆయనకు తెలిపారు.



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న కమర్షియల్ ఆఫీసర్

బందోబస్తు నడుమ ఆక్రమణల తొలగింపు

తాడిపత్రి రూరల్: మండలంలోని యర్రగుంటపల్లిలో మంగళవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు తొలగించే ప్రయత్నం చేశారు. హామీ మేరకు పరిహారం చెల్లించకుండా ఆక్రమణలను తొలగించడంపై అధికారులతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 544డీ హైవే రోడ్డు పనుల్లో భాగంగా గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, ఇతర కట్టడాల తొలగింపునకు మార్కెట్ ధర కంటే ఎక్కువగా ఇవ్వాలని గతంలో సర్వేకి వచ్చిన ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులతో బాధితులు వాగ్వాదానికి దిగారు. ఆశించిన స్థాయిలో పరిహారం వచ్చేందుకు ప్రతిపాదనలు పంపుతామని వారు హామీ ఇచ్చి వెళ్లారు. రోడ్డుకు ఇరువైపులా 60 అక్రమ కట్టడాలను అధికారులు గుర్తించి వాటిలో 40 కట్టడాలకు మూడు నెలల క్రితం పరిహారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో వేశారు. తాము కోరిన విధంగా పరిహారం ఇవ్వకుండా తక్కువ మొత్తంలో బ్యాంకులో వేయడంపై బాధితులు మండిపడ్డారు. ఇదే విషయాన్ని అప్పట్లో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఉన్నతాధికారులతో మాట్లాడుతానని సర్దిచెప్పిపంపారు. ఆ మేరకు పరిహారం అందకపోవడంతో అప్పట్లో పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పనులను పునరుద్ధరించడానికి బాధితులతో అధికారులు మరోసారి చర్చలు జరిపారు. రెండింతల పరిహారం ఇవ్వకుండా మొదట మంజూరు చేసిన మొత్తాన్ని సరిపెట్టే ప్రయత్నం చేయడంతో మంగళవారం ఆక్రమణల తొలగింపునకు అధికారులు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న బాధితులు అడ్డుకునేందుకు ముందురోజు సమావేశమయ్యారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు పోలీసు బందోబస్తును కోరారు. రూరల్‌సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆక్రమణల తొలగింపుపై బాధితుడు నారాయణస్వామితో పాటు మరికొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పరిహారం పేరుతో కేవలం రూ.8 లక్షలకు పైగా మొత్తం మాత్రమే ఇచ్చారని పెద్ద ఇంటికి తక్కువ మొత్తం ఎలా ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. ఆయనకు పోలీసు, రెవెన్యూ అధికారులు సర్దిచెప్పి ఆక్రమణ తొలగింపునకు ఉపక్రమించారు.



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయొద్దు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గార్లదిన్నె: కంటి జబ్బులను నిర్లక్ష్యం చేస్తే జీవితం చీకటి మయం అవుతుందని కంటి వైద్య నిపుణుడు డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని యర్రగుంట్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ కేంద్రం, యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 125 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులను కళ్లద్దాలు పంపిణీ కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, హెచ్‌ఎం గురుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే తొలగిస్తాం



డీఈకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గుత్తి: ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగించే విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు ఏర్పాటు చేస్తే తొలగిస్తామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. సీపీఐ మండల , పట్టణ కార్యదర్శులు రామదాసు, రాజా, నియోజకవర్గం నాయకులు రమేష్, మధు, వెంకటరాముడు తదితరులు కార్యకర్తలతో కలిసి మంగళవారం విద్యుత్ డీఈ కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆందోళన చేశారు. అనంతరం డీఈ పద్మానాభ పిళ్లెకు వినతి పత్రం అందజేశారు.

చంద్రబాబు మోసాలను ఎండగడతాం



తాడిపత్రిలో రీకాలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ అనిల్‌కుమార్



యాడికి మండలం భోగాలకట్టలో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



గార్లదిన్నె మండలం కేశవాపురంలో రీ కాలింగ్ చంద్రబాబు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



పుట్లూరు మండలం కడవకల్లులో 'రీ కాలింగ్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తాడిపత్రిటౌన్/యాడికి/గార్లదిన్నె/పుట్లూరు/ బుక్కరాయసముద్రం/నార్పల: ఎన్నికల ముందు అలవికాని హామీలిచ్చి, వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబు మోసాలను ఎండగడతామని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. తాడిపత్రి పట్టణంలో పలుచోట్ల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి (రూపాయి డాక్టర్) ఆధ్వర్యంలో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని పలు ఇళ్లకు వెళ్లి చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. ఎన్నికల్లో గెలుపొందడానికి కూటమి నాయకులు అలవికాని హామీలిచ్చారన్నారు. అయితే ఒక్క హామీని సరిగా అమలుచేయక ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారన్నారు. అనంతరం ఆయా కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్‌లో పీఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి చంద్రబాబు ఎన్నికల హామీలను గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుత్తి వెంకట రాఘవరెడ్డి, గజ్జల నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి మండలంలోని బోగసముద్రం, బుగ్గ , చిన్నపొలమడ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, ఓబులరెడ్డి ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్రిష్ణారెడ్డి, లక్ష్మయ్య, నారాయణ, బాబు, రామక్రిష్ణ, విశ్వనాథ్, సాయి నాయక్, ప్రేమ్‌కుమార్, రవి పాల్గొన్నారు.

● యాడికి మండలంలోని భోగాలపట్టలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెన్నపూస వెంకటరామిరెడ్డి, తూట్రాళ్లపల్లిలో సంజీవరాయుడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వెన్నపూస నాగేంద్రరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, హనుమంతరెడ్డి, కంబగిరిరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, సంజీవరాయుడు,ప్రతాప్, లక్ష్మి నారాయణ, ముత్యాల రెడ్డి, శ్రీనివాస రెడ్డి, లక్ష్మినారాయణ, మల్లికార్జున, నాగరాజు, రామాంజనేయులు, గుర్రప్ప, రామచంద్రారెడ్డి, నాగేష్, చిన్న రామన్న, పెద్ద రామన్న, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె మండంలోని కొట్టాలపల్లి, కమలాపురం, కేశవాపురం, కొప్పలకొండ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్ర బాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, శింగనమల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పుల్లారెడ్డి, నియోజకవర్గ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

● పుట్లూరు మండలంలోని కడవకల్లు, చెర్లోపల్లి గ్రామాల్లో మంగళవారం 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి రమణాయాదవ్, సర్పంచ్ రామాంజనేయులు, నాయకులు నాగేశ్వరరెడ్డి, కుళ్లాయిరెడ్డి, నరసింహారెడ్డి, రమేష్, పెద్దోడు, నాగముణి, రామకేశవ, లక్ష్మీనారాయణరెడ్డి, నీలకంఠరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు, నీలారెడ్డిపల్లి, రోటరీపురం గ్రామాల్లో ఇంటింటికీ చంద్రబాబు మోసం-మోసపూరిత హామీల రీకా లింగ్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్ రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సర్పంచ్ పార్వతి, రాధా మనోహర్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగ, నరేష్, నాగరాజు, సత్తి, పూల నారాయణస్వామి, లక్ష్మిరెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, జయరామిరెడ్డి, రంగా, బయపరెడ్డి, ఆది, గంగరాజు, కాటమయ్య, రామ్మోహన్‌రెడ్డి, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు

● నార్పల మండలంలోని పుల్సలనూతల, కర్ణపుడికి, గడ్డంనాగేపల్లి, వెంకటాంపల్లి, మద్దలపల్లి,నాయనపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి (అనంతపురం పార్లమెంట్) నార్పల సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, నాయకులు రాంచంద్ర, రాము, వెంకటరాముడు, జాఫర్, పెద్దిరెడ్డి, లక్ష్మీనారాయణ, శివ, ఎంపీటీసీ శంకర్ యాదవ్, లక్ష్మిరెడ్డి, లింగారెడ్డి, రాము, హరి, సోహైల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



బీకేఎస్ మండలం కొర్రపాడులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న గువ్వల శ్రీకాంత్‌రెడ్డి



నార్పల మండలం కర్ణపుడికిలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న సత్యనారాయణరెడ్డి

నేడు 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెలో బుధవారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గార్లదిన్నెలో మధ్యాహ్నం 4 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శైలజానాథ్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని నీలాంపల్లి, కొత్త చెదుల్ల, పాత చెదుల్ల గ్రామాల్లో బుధవారం సాయంత్రం నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ ఆదేశాల మేరకు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

చెరువులకు హంద్రీ-నీవా జలాల విడుదల

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురం గ్రామం వద్ద ఉన్న హంద్రీ-నీవా తూము నుంచి మంగళవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నియోజకవర్గంలోని చెరువులకు కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన తూము వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.